రేపటి నుంచి ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే జరిమానా

● హాలియా మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ

హాలియా ఆగస్టు 18 : ఈ నెల 20 తరువాత హాలియా మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించిన జరిమానా విధిస్తామని కమిషనర్ ఎండీ మున్వర్ అలీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరూ సహకరించాలని సూచించారు. ఈ నెల 14న సోదాల్లో 20వ తేదీ తరువాత ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించమని బేకరీలు, హోటల్స్, కిరాణం షాప్ యజమానులకు తెలిపినట్లు చెప్పారు. తనిఖీల్లో ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే వారిపై చట్ట రీత్యా చర్య తీసుకోవడంతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

'సత్సంగ్‌తో సత్సంబంధాలు'

సత్సంగ్‌లో మాట్లాడుతున్న చంద్రశేఖర్

చిట్యాల,ఆగస్టు 18 : సత్సంగ్‌తో అందరితో సత్సంబంధాలు ఏర్పడుతాయని సత్సంగ్ గురూజీ చంద్రశేఖర్ బసూరి అన్నారు. చిట్యాలలోని సత్సంగ్ కేంద్రం ఆదివారం 2వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాగూర్ అనుకూల చంద్రులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టేటప్పుడు, గిట్టేటప్పుడు ఒంటరిగానే ఉంటామని మధ్యలో జీవించే సమయంలో అందరితో సత్సంబంధాలు కలిగి, తోటి వారికి సాయం చేసి చేయూత నందించాలని అన్నారు. శీలా రమేశ్ స్వప్న సహకారంతో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రావు, డాక్టర్ రాంనిరంజన్, తాపేంద్ర శర్మ, ఈశ్వర్ మహారాణా, సంజయ్, పోలా పెద్దయ్య, పోలా యాదగిరి, ప్రదీప్ ముడాలి జ్యోతిరంజన్ పాల్గొన్నారు.

వట్టిమర్తిలో రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

విగ్రహానికి పూజలు చేస్తున్న అర్చకులు, పాల్గొన్న గ్రామస్తులు

చిట్యాల, ఆగస్టు 18 :మండలంలోని వట్టిమర్తి గ్రామ వేణుగోపాల స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అక్కినపల్లి భీష్మాచారి బృందం వేద మంత్రాల నడుమ ప్రతిష్ఠించారు. అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి, విగ్రహ దాత చింతపల్లి కిష్టయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత

రమేశ్‌కు ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

శాలిగౌరారం, ఆగస్టు 18: మండలంలోని శాలిలింగోటం గ్రామానికి చెందిన బండారు రమేశ్‌కు ఇటీవల బ్రెయిన్ సంబంధిత వ్యాధి రావడంతో దవాఖానలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. దాంతో రమేశ్‌తో పాటు చదువుకున్న 2000-01సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు రమేశ్ అనారోగ్య గురించి విషయం తెలుసుకొని వాట్సప్ ద్వారా ఏకమయ్యారు. రూ.35 వేల పోగు చేసి ఆదివారం రమేశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో పొన్నాల కరుణాకర్, శ్యామ్ సుందర్‌రెడ్డి, గౌస్, సత్యం, రమేశ్, వెంకన్న, భాగ్యలక్ష్మి, శోభ, నిర్మల ఉన్నారు.

సోములుకు అంతర్జాతీయ జపాన్ బ్లాక్ బెల్ట్

సర్టిఫికెట్ అందజేస్తున్న జపాన్ కరాటే మాస్టర్ షిహాన్ టకుమా టనియామా

కట్టంగూర్, ఆగస్టు 18 : మండల కేంద్రానికి చెందిన కరాటే మాస్ట్ అంతటి సోములు గౌడ్ కరాటేలో అంతర్జాతీయ జపాన్ బ్లాక్ బెల్ట్ మూడో డిగ్రీ సాధించాడు. ఈ నెల ఆగస్టు 16 నుంచి 18 వరకు ఛత్తీస్‌గడ్‌లో రాయపూర్‌లో జపాన్ కరాటే ఆసోసియేషన్ ఇంటియా 16వ నేషనల్ మాన్సూన్ ప్రత్యేక శిక్షణ తరగతులు జరిగాయి. అందులో పాల్గొన్న నకిరేకల్ డివిజన్‌కు చెందిన సోములు పాల్గొని ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా జపాన్ కరాటే మాస్టర్ షిహాన్ టకుమా టనియామా సోములుకు బ్లాక్ బెల్ట్ డిగ్రీ సర్టిఫికెట్‌తో పాటు ఇన్‌స్ట్రెక్టర్ లైసన్స్, జపాన్ మెంబర్ షిప్ కార్డు అందజేశారు.

అగ్రి షో నిర్వాహకుడికి సన్మానం

నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున డిగ్రీ కళాశాల ఆవరణలో అగ్రిషో విజయవంతంగా నిర్వహించడంతో నిర్వాహకుడు జూలకంటి రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

బలహీనవర్గాల ఆత్మబంధువు పాపన్నగౌడ్

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి
● జిల్లా వ్యాప్తంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు

మిర్యాలగూడ, ఆగస్టు 18 : సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ జయంతిని ఆదివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. మిర్యాలగూడలో గౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి హాజరై సర్వాయిపాపన్నగౌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. తొలి బహుజన రాజ్య చక్రవర్తిగా, సమ సమాజ సంస్కరణోద్యమ ప్రజా బాంధవుడిగా, బడుగు, బలహీనవర్గాలకు ఆత్మబంధువుడిగా పాపన్నగౌడ్ పేరు ప్రఖ్యాతలు సాధించాడన్నారు. అనేక కోటలు నిర్మించి అభివృద్ధి చేసి సుమారు 40 ఏండ్ల పాటు పాలన సాగించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, గౌడ సంఘం నాయకులు గుండు శ్రీరాములుగౌడ్, జెర్రిపోతుల రాములుగౌడ్, కౌన్సిలర్ ఉదయ్‌భాస్కర్‌గౌడ్, బాసాని గిరి, పెద్ది సైదులుగౌడ్, గుణగంటి శ్రీనివాస్‌గౌడ్, ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ రాజు, వస్కుల మట్ట య్య, బసవయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం: మండలంలోని ఆకారం పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

● చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లిలో కౌండిన్య యువజన సంఘం అధ్యక్షుడు బొడిగె ప్రభాకర్ ఆద్వర్యంలో పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బొడిగె శెట్టి, యువజన సంఘం ఉపాధ్యక్షుడు నమ్ముల కిరణ్, ప్రధాన కార్యదర్శి బొడిగె సాయి, కోయగూర నర్సింహ, బొడిగె అంజయ్య, బత్తుల నర్సింహ పాల్గొన్నారు. ఉరుమడ్ల కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉయ్యాల నాగరాజు, ఉయ్యాల లింగస్వామి, ఉయ్యాల నరేశ్, లింగస్వామి, ఉయ్యాల యాదయ్య, శ్రీను, మారయ్య పాల్గొన్నారు.


మిర్యాలగూడ : సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్, మాజీ మంత్రి జానారెడ్డి

చిట్యాల: వెలిమినేడులో పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మండలంలోని వెల్మినేడు లోఅంతటి పారిజాతానర్సింహ పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించాడు. గ్రామానికి చెందిన నాతి శ్రీనుమంజుల,అంతటి నర్సింహ పారిజాత, నాతి కిరణ్ నీరజ దంపతుల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సంఘం అధ్యక్షుడు నాతి వెంకటరమణ,అంతటి అంజయ్యపాల్గొన్నారు.

● కట్టంగూర్ : మండలంలోని పరడ, బొల్లెపల్లి, కట్టంగూర్, ఈదులూరు గ్రామాల్లో బీఆర్ఎస్, గౌడ్ సంఘం, గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ్ సంఘం నాయకులు పాపన్న విగ్రహానికి, చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమంలో బద్దం శ్రీనివాస్, కొండ యాదయ్య, బద్దం రాములు, నర్సింహ, యాదయ్య, శ్రీను, లింగయ్య పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి :మండల కేంద్రంలోని గౌడ సంఘం భవనంలో పాపన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు పాల్గొన్నారు.

● గుర్రంపోడ్ : మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గాలి రవికుమార్ గౌడ్ , గౌడ సంఘం మండలాధ్యక్షుడు ఐతగోని వెంక టేశ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల సైదులు,గౌడ్,నాయకులు వడ్డెగోని గంగాధర్ గౌడ్, రావు వెంకటనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

గుర్రంపోడ్‌లో..

నార్కట్‌పల్లి: సర్వాయి పాపన్న ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

శాలిగౌరారం: ఆకారంలో సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

దేవరకొండరూరల్, ఆగస్టు 18:ల దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ పరిసరాల్లో ఆదివారం పిడుగు పాటుకు వ్యక్తి మృతి చెందాడు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర గ్రామానికి చెందిన సాలి సతీశ్(45)తన గొర్రెలమందను మేపుకుంటూ ఆదివారం దేవరకొండకు చేరుకున్నాడు. అక్కడే ఉన్న బహిరంగ ప్రదేశంలో గొర్రెలకు కాపలాగా ఉన్న సమయంలో పిడుగు పడడంతో సతీశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని యువకుడి మృతి

● సాగర్ వచ్చి వెళ్తుండగా ఘటన

సంజయ్ (ఫైల్)

పెద్దపూర,ఆగస్టు 18 : పెద్దపూర మండలంలోని పోట్టెగాని తండా సమీపంలోగుర్తు తెలియని వాహనం ఢీ కొని యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని బహదూర్ పూరకు చెందిన మునిగల సంజయ్, గాద సందీప్ శనివారం నాగార్జున సాగర్‌కు వచ్చి రాత్రి 7గంటలకు హైదరాబాద్ కు స్కూటీపై తిరుగు ప్రయాణమయ్యారు. మండలంలో పోట్టెవాని తండా సమీపనంలోకి రాగానే మాల్లేపల్లి నుంచి సాగర్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ లోని కామినేని హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ సంజయ్ కుమార్ ఆదివారం మృతి చెందా డు. సందీప్ చికిత్స పొందుతున్నాడు. మృతుడి మేనమామ మాడిశెట్టి నవీన్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి

పెద్దపూర, ఆగస్టు18 : చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. ఎస్ఐ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముసలమ్మ చెట్టు గ్రామ పరిధిలో గల బస్టాప్‌లో ఈ నెల 8న గుర్తు తెలియని వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని పోలీసులకు సమాచారం ఇవ్వగా 108లో నాగార్జున సాగర్‌లోని కమలానెహ్రూ హాస్పిటల్‌కు తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండ ఏరియా హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 16న మృతి చెందాడని తెలిపారు. వ్యక్తి మృతదేహాన్ని నల్లగొండ మార్చురీ గదిలో భద్రపరిచమని మృతుడికి సంబంధించిన వివరాలు తెలిస్తే 8712670198కి సమాచారం అందించాలని ఎస్ ఐ తెలిపారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 18: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే, సీపీ ఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మూడు విడుతల్లో సుమారు 6 లక్షల మంది రైతులకు రూ.35 వేల కోట్ల రుణమాఫీ చేశామని చెబు తున్నప్పటికీ రాష్ట్రంలో ఇంకా అనేక మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. అలాగే నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధి ఆయకట్టు మేజర్ వజీరాబాద్, ముల్కలకాల్వ, కిష్టాపురం పరిధిలోని చివరి భూములకు నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాల్వల్లో పిచ్చిమొక్కలు, కంపచెట్లు ఉండడంతో దిగువకు నీరు పారకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టి నీరు సజావుగా పారేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, బావండ్ల పాండు, పరశురాములు, పిలుట్ల సైదులు పాల్గొన్నారు.

కొమ్మేపల్లి గిరిజన కళాశాలలో ఖాళీల భర్తీకి రేపు కౌన్సెలింగ్

దేవరకొండరూరల్, ఆగస్టు18 : మండలంలోని కొమ్మేపల్లి గిరిజన గురుకుల కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీ మంగళవారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రఘుపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 వ తరగతిలో-09, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ-22, బైపీసీ-16 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

ఆసక్తి గల విద్యార్థులు (లంబాడీ, ఎరుకల,చెంచు) బోనఫైడ్, కుల, ఆదాయ, ధ్రువీకరణ, ఆధార్ కార్డు ఓరిజినల్ సర్టిఫికెట్లు, కొమ్మేపల్లి గిరిజన కళాశాలకు 20న ఉదయం 10గంటలకు హాజరు కావాలని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

కట్టంగూర్ : పరడలో ముత్యాలమ్మ ఆలయం వద్దకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

కట్టంగూర్, ఆగస్టు 18 : మండలంలోని పరడ, దుగినవెల్లి, నారెగూడెం గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగి ంపుగా తీసుకెళ్లి ముత్యాలమ్మ, మారెమ్మ అమ్మవార్లకు నైవేద్యంతో పాటు కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

నార్కట్‌పల్లి: యాదవుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి బోనాలు నార్కట్‌పల్లిలో ఆదివారం నిర్వహించారు. బోనం కుండను భక్తి శ్రద్ధలతో పూజించి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి పెద్దమ్మ తల్లికి నైవేద్యాన్ని సమర్పించారు. కార్యక్రమంలో యాదవులు పాల్గొన్నారు.

వర్డల్ కన్స్యూమర్స్ రైట్స్ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా నవీన్‌కుమార్

రామగిరి, ఆగస్టు 18 : వరల్డ్ కన్స్యూమర్స్ రైట్ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా కనగల్ మండలం దర్వేశిపురానికి చెందిన నాగోజు నవీన్‌కుమార్ నియామకయ్యారు. ఆ సంస్థ జిల్లా చైర్మన్ పొట్టబత్తుల సైదులు ఆదివారం ఆయనకు నియమక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్ని తెలిపారు.

కిరాణ దుకాణంలో చోరీకి యత్నం.. పోలీసుల అదుపులో దొంగ

పెండ్లిపాకల ఎక్స్‌రోడ్డులో పగులగొట్టిన రేకులు

కొండమల్లేపల్లి, ఆగస్టు 18: మండలంలోని పెండ్లిపాకల ఎక్స్ రోడ్డులో గల కిరాణదుకాణంలో దొంగతనం చేయడానికి ప్రయత్నించిన దొంగను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బుడ్డోనితండాకు చెందిన నేనావత్ కుమార్, అనిత దంపతులు పెండ్లిపాకల ఎక్స్ రోడ్డులో ఉన్న వెంచర్‌లో రేకులతో డబ్బా నిర్మించుకుని కిరాణ దుకాణం నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే శనివారం సాయం త్రం 10 గంటలకు డబ్బా మూసి పక్కనే ఉన్న బుడ్డోనితండా వెళ్లాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి ఓ దుండగుడు ఆ బెల్ట్ షాపులో దొంగతనం చేయడాన్ని వచ్చి డబ్బా వెనుక భాగంలో తన దగ్గర ఉన్న ఆయుధంతో రేకులను పగలగొట్టే ప్రయత్నం చేస్తుండగా ఆ శబ్దానికి ఎదురుగా నివాసం ఉంటున్న కడారి యాదయ్య శబ్దం వస్తుండడంతో షాపు యజమానికి ఫోన్ చేసి విషయం చెప్పడంతో వెంటనే షాపు యజమాని కుమార్, అతడి బావ వెంకటేశ్, యాదయ్య, అతడి కుమారుడు అందరూ కలిసి ఘటన స్థలానికి చేరుకొని దొంగను పట్టుకొని 100 నంబర్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దొంగను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ జరుపుతున్నారు.

జూనియర్ డాక్టర్ హత్య నిందితులను శిక్షించాలని నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న మీనా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు.

మిర్యాలగూడ, ఆగస్టు 18: కోలకత్తాలో జూనియర్ వైద్యురాలిపై లైంగికదాడి చేసి హత్య చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని మీనా మహిళ ఇంజినీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాలల విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రవినాయక్ మాట్లాడుతూ నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలన్నారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో గూడా నాగేంద్రప్రసాద్, పల్లా భిక్షం, వదూద్, నాగేశ్వర్‌రావు, సరిత, జ్యోతి, నాగమణి, స్వరూప, క్రాంతి, సుజాత పాల్గొన్నారు.

మరబోట్ల విషయంలో ఘర్షణ

● ఒకరిపై ఒకరు దాడులు ● పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన సమస్య

చందంపేట(నేరేడుగొమ్ము), ఆగస్టు 18: సాగర్ వెనుక జలాలు నిండడంతో మర బోట్లను నిలిపే విషయమై ఆదివారం నేరేడుగొమ్ము మండలంలోని వైజాక్ కాలనీ, బుగ్గతండా మత్స్యకార్మికులు ఘర్షణకు దిగారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో వైజాగ్ కాలనీకి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు జోక్యం చేసుకొని సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఇదిలా ఉంటే సాగర్ వెనుక జలాలు నిండుకుండలా మారడంతో పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు హైదరాబాద్, వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. మరబోట్ల వివాదం నేపథ్యంలో పోలీసులు ఇరువర్గాలతో సోమవారం చర్చించనున్నట్లు ఎస్ఐ సతీశ్ తెలిపారు.

రేపటి నుంచి అంకాలమ్మ జాతర

చందంపేట, ఆగస్టు 18: చందంపేట మండలం చిత్రియాలలో ప్రతి ఏడాది శ్రావణమాసం పురస్కరించుకొని గిరిజనులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే అంకాలమ్మజాతర ఈనెల 20,21,22 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన కాటమయ్య ఆలయాన్ని ఈ నెల 19న ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కాగా అంకాలమ్మ జాతరలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కానుకలు సమర్పిస్తుంటారు.

అ'పూర్వ'సమ్మేళనం

శాలిగౌరారం : ఆకారంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


కట్టంగూర్ :అయిటిపాముల జడ్పీ ఉన్నత పాఠశాల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాలిగౌరారం, ఆగస్టు18 : మండలంలోని ఆకారం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2009-10 సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని తమ చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని గురజాల ఉన్నత పాఠశాలలో 1995-96 సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు.


దేవరకొండ : పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

● చందంపేట(దేవరకొండ) : దేవరకొండ పట్టణంలోని విద్యోదయ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003-04 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకొని, తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వనం చంద్రమౌళి, చంద్రకళ, కలీం, రామకృష్ణ, గంగాధర్, పూర్వ విద్యార్థులు చరణ్, జయకృష్ణ, ప్రవీణ్, ఇర్ఫాన్, గోగికార్ కిరణ్, వెంకటేశ్, రమేశ్, కలీం, కుమార్ కల్పన, స్వాతి, అశ్విని పాల్గొన్నారు.

● కట్టంగూర్ :మండలంలోని అయిటిపాముల ఉన్నత పాఠశాలలో 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గుత్తా దామోదర్‌రెడ్డి, మిట్ట లక్ష్మారెడ్డి, సాంబయ్య, రామచంద్రారెడ్డి, జంగిడి యాదయ్యను పూర్వ విద్యార్థులు శాలువా, పూలమాలతో సన్మానించి మొమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఇటికాల సురేందర్‌రెడ్డి, మేడి రామలింగయ్య, బొజ్జ సైదులు, కర్నాటి నవీన్‌కుమార్, పెద్ది రమేశ్, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, బోగరి నాగరాజు. దామోదర్, రాం బాబు, ఫాతీమా, రాజ్యలక్ష్మి, సాయిలక్ష్మి, మోహన్, రవి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325790-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777196 | హుజూర్‌నగర్: 9182777638